క్లుప్తంగా

కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలు



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోటో ఖాన్ కరాటే అకాడమీ దూ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు అకాడమీ ఫౌండర్ అబ్దుల్‌నబీ తెలిపారు. ఈ గ్రేడింగ్ పరీక్షల్లో 10మంది బ్లాక్ బెల్ట్, 20 మంది విద్యార్థులు వివిధ కలర్స్ బెల్ట్ సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ డిప్యూటీ ఫౌండర్ హరీష్ యాదవ్, జాఫర్, సాధిక్, బాబా, అజ్మీర్, లాస్య, కార్తికేయ, గౌస్‌పాషా ఉన్నారు.

విరాళం అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్యాన మందిరంలో ఏర్పాటు చేయనున్న అలంకార శివుడి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన సీఎస్ ఆర్ ఫిల్లింగ్ స్టేషన్ అధినేత దాడి చంద్రశేఖర్ రెడ్డి, వనజ దంపతులు తమ సహాయంగా రూ.81వేలు విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. ఆలయంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు.

విద్యార్థులకు సన్మానం



వనపర్తి టౌన్: విద్యార్థులు పట్టుదలతో ప్రయత్నిస్తే లక్ష్యాలను సాధించగలరని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వెలువడించిన పాలీసెట్ ఫలితాల్లో రాష్ట్ర ర్యాంకులు సాధించిన విజ్‌డమ్ అకాడమీ విద్యార్థులు ప్రణవ్ (110/120) 314వ ర్యాంకు, అభిరామ్ (104/120) 712వ ర్యాంకు, సాయి భరత్ (102/120) స్టేట్ 991వ ర్యాంకులు సాధించగా.. వారిని చిన్నారెడ్డి శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే లక్ష్యాలను చేధించే అలవాటు ఉండాలని, బద్ధకంతో కాకుండా నమ్మకంతో ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పీర్ల గుట్టలో కదిరె శ్రీనివాసులు, 22వ వార్డులో చీర్ల బాలీశ్వరమ్మ, 5వ వార్డు ఇందిరా కాలనీలో గంధం కురుమయ్య, 19వ వార్డు గాంధీనగర్‌లో చాకలి రాజశేఖర్ సోమవారం మృతి చెందారు. ఈ మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచన మేరకు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ. 5వేల చొప్పున అందించారు.

శ్మశాన వాటికలో వసతుల కల్పన



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఎస్సీ స్మశాన వాటికలో గ్రామస్తుల అవసరం మేరకు గ్రామానికి చెందిన కర్రోళ్ల స్వప్నభాస్కర్ తన సొంత ఖర్చుతో బోరు మోటారు వేయించారు. నీరు పుష్కలంగా పడటంతో దానికి కావాల్సిన పైపులు, మోటారు ఏర్పాటు చేయించి అవసరమైనప్పుడు నీరు వాడుకునేలా కరెంటు సౌకర్యం, లైట్లు బిగించారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు అవసరమైన షెడ్డును సైతం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంగరిగల్ల బాలస్వామి, గోపాల్, శివన్న, మాజీ వైస్ ఎంపీపీ భర్త శేఖర్, మాజీ ఉపసర్పంచు శివ, తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సిద్ధం



అప్పారెడ్డిపల్లి శివారులో పత్తి పంటకు అచ్చులు కొడుతున్న రైతులు

- తొలకరి వర్షాలతో వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ
- ఇప్పటికే కొన్ని గ్రామాల్లో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు

ఖిల్లాఘనపురం: వర్షాకాలం మొదలవుతుండటంతో మండలంలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో ఇటీవల కురిసిన మోస్తరు వర్షాలకు అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ, పర్వతాపురం తదితర గ్రామాల్లో రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. దుక్కుల్లో చెత్తా, గతంలో సాగు చేసిన పంటకు సంబంధించిన కొయ్యలు తొలగించారు. గుంటుకలు తోలడం, పత్తి సాగు చేసుకోవడానికి అనుగుణంగా సాళ్లు తోలడం లాంటి పనులు చేపట్టారు. కర్నెతండా, గార్లబండతండా, ఆముదంబండ తండా తదితర ప్రాంతాల్లో గిరిజనులు తొలకరి వర్షాలకే జొన్న పంటను సాగు చేసుకున్నారు. ఈ నెల 8న రోహిణి కార్తి పోతుండటంతో ఎలాగైనా ఇదే కార్తిలో విత్తనాలు విత్తుకోవాలని కొందరు రైతులు ఒట్టి దుక్కుల్లోనే పత్తి విత్తనాలను విత్తుకుంటున్నారు.



అల్లమాయపల్లి శివారులో దుక్కి సిద్ధం చేసుకున్న రైతు



మల్కిమియాన్‌పల్లి శివారులో ఒట్టి దుక్కిలోనే పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు



సల్కెలాపురం శివారులో గుంటుక కొడుతున్న రైతు

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు



పాన్‌గల్‌లో విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

పాన్‌గల్: నకిలీ విత్తనాలు విక్రయించిన, రైతులను మోసగించిన ఫర్టిలైజర్ దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తప్పవని మండల టాస్క్‌ఫోర్స్ బృందం హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం దుకాణంలోని వరి విత్తనాల్లో ఉండే నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా జన్యుపరమైన మంచి విత్తన రకాలను పరిశీలించారు. దుకాణంలోని రికార్డులు, విత్తనాల పాకెట్లను పరిశీలించినట్లు వారు పేర్కొన్నారు. కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల టాస్క్‌ఫోర్స్ బృందం ఇన్‌చార్జి ఏఓ మల్లయ్య, డీటీ అశోక్‌నాయుడు, హెడ్ కానిస్టేబుల్ రోశయ్య పాల్గొన్నారు.



శ్రీరంగాపూర్‌లో..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో వ్యవసాయ అధికారి చంద్రమౌళి స్థానిక పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లో గల విత్తనాల పాకెట్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే రైతులు ప్రభుత్వం గుర్తింపు పొందిన షాపుల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు లూజుగా కొనుగోలు చేయొద్దన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని దుకాణ యజమానులకు హెచ్చరించారు.

కుక్కల దాడిలో జింక మృతి

పాన్‌గల్: వ్యవసాయ పొలంలో మేత కోసం వచ్చిన జింకపై కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, ఫారెస్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాధరావుపల్లి సమీపంలోకి మేత కోసం వచ్చిన జింకను కుక్కలు దాడి చేసి గాయపర్చడంతో గ్రామస్తులు, రైతులు గమనించి జింకను కాపాడారు. ఆ జింకను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో పోలీసులు వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం మండల పశువైద్య కేంద్రానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన జింకకు పశువైద్య సిబ్బంది కుట్లు వేసే క్రమంలో జింక మృత్యువాత పడింది. మృతిచెందిన జింకను ఫారెస్టు అధికారులు పంచనామా నమోదు చేసుకొని జిల్లా కార్యాలయానికి తరలించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఖననం చేయనున్నట్లు ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు. ఏప్రిల్ 18వ తేదీన కూడా పాన్‌గల్‌లో కుక్కల దాడిలో జింక చనిపోయింది. మండలంలో ఇలాంటి ఘటనలు ఇప్పటికే రెండు జరిగాయి. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు స్పందించి వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



జింకకు ప్రథమ చికిత్స నిర్వహిస్తున్న పశువైద్య సిబ్బంది

లింగయ్యకు సన్మానం

వనపర్తిటౌన్: పిల్లల్లోని అభిరుచికి ప్రాణం పోస్తున్న కళాకారుడు బస్ లింగయ్య అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. వేసవి శిబిరం ఏర్పాటు చేసి పట్టణంలోని పిల్లలకు లింగయ్య చిత్రకళలో శిక్షణ ఇస్తున్నాడు. ఈ మేరకు ఆయనను సాహితీవేత్తలు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. దాదాపు 30 మంది విద్యార్థులు వేసవి సెలవుల్లో లింగయ్య వద్ద చిత్రలేఖనంలో శిక్షణ పొందారని తెలిపారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలు, పాటలు, డ్రాయింగ్, డాన్స్, తదితర అంశాలల్లో పాల్గొనాలని సూచించారు. విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి, వారిని అందులో చురుగ్గా చేయాలని, కళలు మానసిక ఆనందంతో పాటు, ఏకాగ్రతను పెంపొందిస్తాయన్నారు. బస్ లింగయ్య 36 ఏళ్లుగా డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తూ ఎంతో మందిని తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, బొజ్జి బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బస్ లింగయ్యను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

బీచుపల్లి ఆలయంలో ఎమ్మెల్సీ దంపతులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని సోమవారం ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌కుమార్‌రెడ్డి దంపతులు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఈఓ రామన్‌గౌడ్ వారిని శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ మీద ఉన్న అభిమానం ఎప్పటికి చెరిగిపోదన్నారు. బీచుపల్లి అంజన్న సాక్షిగా మళ్లీ బీఆర్ఎస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, దిలీప్‌రెడ్డి, పద్మా వెంకటేష్, నరేష్, వేణు, శాంతన్న ఉన్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

విద్యార్థికి అభినందన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురానికి చెందిన ఆకునమోని సంతోష్ రాష్ట్రంలో 141వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడారు. కొల్లాపూర్‌లోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. కోస సంస్థ వారు ఉచితంగా పాలీసెట్ కోసం కోచింగ్ ఇవ్వడానికి అర్హత పరీక్షలో అర్హత సాధించడంతో, హైదరాబాద్, కోఠి సాయి మేధా కోచింగ్ సెంటర్‌లో 45 రోజులు ఉచితంగా కోచింగ్ ఇచ్చినట్లు చెప్పారు.

సీసీరోడ్డు నిర్మించండి

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మానవపాడు వాగు నుంచి మండల కేంద్రంలోని సవిడి వెళ్లే దారిలో మట్టి రోడ్డుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా రోజులుగా అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే గుంతల్లో నీల్లు చేరి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



కత్తేపల్లి చెరువు కట్టపై ప్రమాదకర మలుపులు

- ప్రమాదకరంగా కత్తేపల్లి చెరువు రోడ్డు
- మలుపుల్లో ప్రతినిత్యం ప్రమాదాలు

ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లి గ్రామ చెరువు ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రమాదభరితంగా మలుపులు ఉండడంతో వాహనదారులు చెరువులోకి దూసుకెళ్తున్నారు. చెరువుపై ఆరు ప్రమాదకరమైన మలుపులు, సింగిల్ రోడ్డు ఉండడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. చెరువుపై నుంచి రోడ్డు ఉండడంతో ఆత్మకూర్ నుంచి కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, రేచింతల, పెబ్బేరు తదితర ప్రాంతాలకు ఈచెరువుపై నుంచే నిత్యం వందల సంఖ్య వాహనాలతో ప్రయాణం చేస్తుంటారు. చెరువుకట్టపై బారికేడ్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నియంత్రించొచ్చని అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఆత్మకూర్: ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తకోటకు చెందిన యాదయ్య తన ద్విచక్ర వాహనంపై ఆత్మకూర్‌కు వచ్చిన కొత్తకోటకు తిరుగు ప్రయాణమయ్యాడు. సాయంత్రం 5 గంటల సమయంలో బాలకిష్టాపూర్ సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయాన్ని గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించి ఆత్మకూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ రోషయ్య తెలిపారు.

'మోదీకే పట్టం'

ఖిల్లాఘనపురం: ప్రధాని నరేంద్రమోదీ మరోసారి అధికారం చేపట్టడం ఖాయమని వనపర్తి జిల్లా బీజేపి ఓబీసి కార్యదర్శి ఆశన్న అన్నారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయితే తాను గుండు గీయించుకుంటానని ప్రకటించిన ఆమ్‌ఆద్మీ ఎమ్మెల్యే సోమ్‌నాథ్ అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తాను వృత్తి రీత్యా ఎమ్మెల్యేకు గుండు గీయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. నిజాయితీకి, అవినీతి రహిత పాలనకు మారుపేరుగా ఉన్న నరేంద్ర మోదీపై బురదజల్లే పనులు చేస్తే దేశ ప్రజలు తగిన బుద్ధి చెబుతారనడానికి మంగళవారం వచ్చే ఫలితాలే సాక్ష్యం అన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



కొత్తకోట రూరల్: బండల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన కొత్తకోట మండలంలోని మిరాసిపల్లి ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్నూల్ వైపు నుంచి లారీ బండల లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తుండగా మిరాసిపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే లారీలో సాంకేతిక లోపం కారణంగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో బండలు రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, హైవే సిబ్బంది ఎంతో శ్రమించి బండలను, లారీని పక్కకు తీసి ట్రాఫిక్ క్రమద్ధీకరించారు. డ్రైవర్ సంతోష్‌కు స్వల్ప గాయాలు కావడంతో అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఏకకాలంలో పంట రుణమాఫీ చేయాలి



ఆత్మకూర్: రైతుల పంట రుణమాఫీ రూ.2 లక్షలు ఏకకాలంలో చేయాలని.. అన్నిరకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా పంపిణీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. దళిత, గిరిజన, సన్నకారు రైతులకు ఉచితంగా, మిగిలిన వారికి 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు, మినీ ట్రాక్టర్లు ఇవ్వాలని అందించాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ వ్యవసాయరంగానికి తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.500 పంట బోనస్‌తో పాటు పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్ల వినతిపత్రాన్ని ఆర్ఐ జయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటన్న, వాసారెడ్డి, ప్రసాద్, నాగేష్, వెంకటయ్య, నారాయణ్‌రెడ్డి, హన్మంతు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1 పరీక్షకు అర్థరహిత నిబంధనలు

పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్–1 పరీక్షలకు సంబంధించి అర్థరహిత నిబంధనలను తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ కుతుబ్ డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహిణులు తాళిబొట్లు, మెట్టెలు తీసివేసి పరీక్షలకు హాజరు కావాలనే నిబంధనపై మండిపడ్డారు. హిందూ స్త్రీలు తాళి, మెట్టెలు భర్త మరణించినప్పుడు మాత్రమే తొలగిస్తారని, అందువల్ల ఈ నిబంధనలు సరికాదన్నారు. పరీక్ష ప్రారంభానికి అర్ధగంట ముందే కేంద్రాల ప్రవేశ ద్వారాలను మూసివేసే నిబంధన కూడా సరికాదని, ఇది మారుమూల పల్లెల నుంచి వచ్చే అభ్యర్థులకు బస్సులు, టూ వీలర్స్‌పై వస్తారని, అంతే కాకుండా వర్షాలు పడుతున్నందున ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ వెంట బ్యాగులు, పుస్తకాలు పర్సులు, సెల్‌ఫోన్లు తెచ్చుకుంటారని ప్రతి సెంటర్లో వాటిని భద్రపరిచేందుకు ఒక గదిని కేటాయించాలని కోరారు. నిబంధనలు సడలించకుంటే ఏఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విష్ణు, రాంబాబు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎండీ కుతుబ్

రత్నగిరి ఫౌండేషన్‌తో మెరుగైన సేవలు

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్‌తో పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులకు, యువతకు అవసరమైన సేవలు అందిస్తామని మంత్రి జూపల్లి తనయుడు అరుణ్ రావు అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌రావు మాట్లాడారు. మా నాన్నమ్మ, తాతయ్య జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేశామని వివరించారు. వేలాది మంది విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణలు అందించామన్నారు. ఇప్పుడు కంప్యూటర్ శిక్షణలతో పాటు, ఉపాధి అంశాలపై కూడా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలకు ఉపయోగపడే కార్యక్రమాలు కూడా చేపడుతామన్నారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వెల్లడించారు. ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ మాట్లాడారు. సమ్మర్ క్యాంపులో క్రీడలపై విద్యార్థులకు అవగాహన ఏర్పడిందన్నారు.

ఉభయలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో వెలసిన ఉభయ రామలింగేశ్వరస్వామి వారి కల్యాణవేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ధర్మకర్తలు ఆర్ఎన్ బీచుపల్లి, గజేందర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామివారి ఆరాధనలో మునిగితేలారు. కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన ఆలయం, విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగిన 41 రోజుల్లో స్వామివారి కల్యాణం, హోమాలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. నంద్యాల శషిభూషణ సిద్ధాంతి, పురోహితుడు రవిశాస్త్రి సమక్షంలో కనులపండువగా నిర్వహించారు. 41 రోజులపాటు నిష్ఠగా భక్తిశ్రద్ధలతో ఉన్నందున గ్రామస్తులందరికి ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు ఆలపించిన సంకీర్తనలతో ఆలయ మార్మోగింది.



ఉభయ రామలింగేశ్వరస్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవ పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

అమరచింత: పట్టణంలోని జములమ్మ దేవత ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో జములమ్మ దేవత మూర్తి విగ్రహ ప్రతిష్ఠ జరిగి పదేళ్లు పూర్తి చేసుకోవడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగలి నరసింహులు మాట్లాడుతూ ఆలయ నిర్వహణకు పట్టణ ప్రజల సహకారంతో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అమ్మవారి దీవెనలతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్మోహన్‌శెట్టి, పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ మండలంలోని సూగూరులో గల శ్రీకోదండరామస్వామి ఆలయంలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం చేశారు. గడిచిన పదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. దేశంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేశారని మండల అధ్యక్షుడు మోహన్‌సాగర్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుమ్మరి నారాయణ, తరుణ్, ఎల్లస్వామి తదితరులు ఉన్నారు.

సీతారామాంజనేయ ఆలయంలో..

పాన్‌గల్: మండలంలోని అన్నారం గ్రామ సీతారామాంజనేయ ఆలయంలో సోమవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఆలయం ప్రారంభమై 41 రోజులు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న మండల పూజ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక తోడ్పాటునందించిన గ్రామస్తులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి వివిధ అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని శివాలయాన్ని దర్శించుకున్నారు.



సూగూర్‌లో..



అమరచింతలోని జములమ్మ ఆలయంలో..